ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం, 6 మే 2024
3



ఇందిరమ్మ రాజ్యంలో
అందరికీ ఇళ్లు



కల్లూరులో కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన అభ్యర్థి రఘురాంరెడ్డి

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిందేమీ లేదు
- ఖమ్మం నుంచి రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి
- కల్లూరు కార్నర్ మీటింగ్‌లో మంత్రి తుమ్మల

కల్లూరు, మే 5: రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు చేసింది ఏమీ లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ప్రజలు తెచ్చుకున్న ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కల్లూరులోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయం కోసం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఖమ్మం పార్లమెంట్ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా జరగనుందన్నారు. ఈ ఎన్నికల్లో గౌరవప్రదమైన కుటుంబం నుంచి సురేందర్‌రెడ్డి వారసుడిగా రఘురాంరెడ్డి పోటీ చేస్తున్నారని తెలిపారు. ఈ జిల్లానుంచి కాంగ్రెస్ తరుపున రఘురాంరెడ్డిని గెలిపిస్తే ఢిల్లీస్థాయిలో మనం ఒక ఫోన్ చేస్తే ఈ ప్రాంతానికి సంబంధించి ఏ పనైనా అవుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదవాడికి ఒక్క ఇల్లు రాలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికి ఇల్లు ఇస్తామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయిని అత్యధిక మెజారిటీతో గెలిపించినట్టే దానికి రెట్టింపు మెజారిటీతో రఘురాంరెడ్డిని ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. కల్లూరు మండలంలో రహదారులు లేని రోజుల్లోనే తనను ఇక్కడి ప్రజలు గెలిపించారని ఆయన గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితోనే తాను అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు. స్థానికంగా ఏ పని జరగాలన్న ఎమ్మెల్యే రాగమయి ద్వారా జరుగుతుందన్నారు. సహచర మంత్రి, కల్లూరు మండలవాసి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి కూడా అభివృద్ధిలో తోడ్పాటు అందిస్తారన్నారు.

బీఆర్ఎస్ బీజేపీలు బీ టీంలే..

దేశ రాజకీయల్లో బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై బీ టీంలా పనిచేస్తున్నాయని ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విమర్శించారు. నామాను గెలిపిస్తే మంత్రిని చేస్తానని కేసీఆర్ ఖమ్మం పర్యటనలో చెప్పటం ప్రజలను మోసగించటమేనన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా.. ఖమ్మం జిల్లాకు రావాల్సిన రైల్వేలైన్, ఎయిర్‌పోర్ట్, గిరిజన యూనివర్శిటీలు ఇంతవరకు ఎందుకు రాలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిన నాలుగు నెలలకాలంలోనే అనేక సంక్షేమ, అభివృద్ధిపనులు జరిగాయన్నారు.సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అన్ని విధాలుగా మోసపోయారన్నారు. కాంగ్రెస్ వచ్చిన అనతికాలంలోనే సత్తుపల్లి నియోజకర్గానికి ఇప్పటికే రూ.100కోట్లు నిధులు వచ్చాయని, రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే రాగమయి తెలిపారు. రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, అంకిరెడ్డి సత్యనారయణరెడ్డి, సత్యంబాబు, బాగం ప్రభాకర్‌చౌదరి పాల్గొన్నారు.



పతాకస్థాయికి
ప్రచార పర్వం

- సభలు, ర్యాలీలు, రోడ్‌షోలతో పార్టీల జోరు
- అగ్రనేతల రాకతో శ్రేణుల్లో పెరిగిన జోష్
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు
- ప్రచారానికి మరో ఆరురోజులే సమయం

లోక్‌సభ ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరింది. ఇరు జిల్లాల్లో ఆయా పార్టీలు తమ అభ్యర్థుల తరుపున ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నాయి. సభలు, సమావేశాలు, రోడ్‌షోలు సాగిస్తూనే కిందిస్థాయి కేడర్‌తో ఓటర్లను కలుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల అగ్రనేతలు, రాష్ట్రస్థాయి నేతలు ఇప్పటికే ప్రచారం నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ తరుపున కొందరు సినీ నటులు కూడా ప్రచారంలోకి రాబోతున్నారు.

ఖమ్మం, మే 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కాంగ్రెస్ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్ విజయం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కొత్తగూడెంలో జనజాతర సభ నిర్వహించారు. మరోవైపు నియోజకవర్గాల్లో రోడ్‌షోలు సభలు సమావేశాలు సాగిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను 3 లక్షల మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో ఆరుగ్యారంటీలతో పాటు రూ.2లక్షల రుణమాఫీ, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలనే అంశాలను ప్రస్తావిస్తున్నారు. పార్టీకి చెందిన సీనియర్ నేతలు ప్రతిరోజు ప్రచారంలో పాల్గొంటున్నారు. సినీ నటుడు వెంకటేష్ కాంగ్రెస్ అభ్యర్థులు రఘురాంరెడ్డి, బలరాంనాయక్‌ల విజయం కోసం మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రచారానికి మరికొందరు అగ్రనేతలు రాబోతున్నారు.

ఇక బీఆర్ఎస్ కూడా జిల్లాలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం సాగిస్తోంది. కాంగ్రెస్‌కు పోటీగా ఆ పార్టీ నేతలు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు గుప్పించారు. అలాగే ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ అభ్యర్థి మాలోతు కవితలు ప్రతిరోజు రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తుండగా, బీఆర్ఎస్ గ్రామ, మండలస్థాయి కేడర్ కూడా ఇంటింటి ప్రచారం ప్రారంభించింది. లోక్‌సభలో తెలంగాణవాణి వినిపించాలంటే నామాను గెలిపించాలని సూచిస్తున్నారు.

ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కూడా ప్రతిరోజు మండల కేంద్రాల్లో రోడ్‌షోలు, విజయ శంఖారావం సభలు నిర్వహిస్తున్నారు. ఆయన తరుపున రాష్ట్ర, జిల్లా నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. బీజేపీ ఉభయ జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్‌తో పాటు కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ప్రచారంలో పాల్గొంటున్నారు. తాండ్ర వినోద్‌రావు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. బీజేపీ తరుపున ఇప్పటికే కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా జిల్లాలో ప్రచారం సాగించారు. త్వరంలో జిల్లాకు ప్రధాని మోదీ లేదా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాబోతున్నారు. అలాగే వరంగల్ కాకతీయ వంశానికి చెందిన బస్తర్ రాజు కమలచంద్ర భంజ్‌దేవ్, సినీ హీరోయిన్ కుష్బూ తదితరులను కూడా బీజేపీ ప్రచారంలోకి దించబోతోంది. మరోవైపు ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వలసలకు శ్రీకారం చుట్టింది. మొత్తం మీద ప్రధాన పార్టీలకు దీటుగా బీజేపీ కూడా ప్రచారం సాగిస్తోంది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి సీతారాంనాయక్ కూడా ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రులు కూడా తమ గుర్తు తెలుపుతూ ప్రచారంలోకి దిగారు. ప్రచారం గడువు దగ్గరపడుతున్నందున ఎవరికి వారు ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు.



కొణిజర్లలో ప్రచారంలో మాట్లాడుతున్న నామా

ఓటుతో ఆశీర్వదించండి

బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, మే 5: నా వ్యక్తిత్వం మీకు తెలుసు.. ప్రజాసేవ చేయాలనే ధ్యేయంతో రాజకీయాల్లోకి వచ్చాను. మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించండి అని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాపర్తి నగర్‌లో వాకర్స్‌ను కలుసుకొని ఓట్లను అభ్యర్థించారు. అనంతరం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి అండగా నిలిచానన్నారు. జిల్లా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశానన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని నామా పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాలకు ఎక్కువ రోజులు హాజరై, ఎక్కువ ప్రశ్నలు అడిగి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ తిరిగి కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. మళ్లీ తనకు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని నామా హామీ ఇచ్చారు. అలవికాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. కొణిజర్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కన్వీనర్లు జీ వీరభద్రం, బాగం కోటేశ్వరరావు, నామా సైదులు, దేవరపల్లి ఏకాంబరరావు, నెల్లూరి చంద్రయ్య, ముండ్ల రమేష్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న తాండ్ర వినోద్‌రావు

కాంగ్రెస్ మోసం చేయాలని చూస్తోంది

బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

తల్లాడ, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలను అమలుకాని హామీలతో మళ్లీ మోసం చేయాలని చూస్తోందని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి తల్లాడలో బీజేపీ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. నారాయణపురం నుంచి తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్ వరకు రోడ్‌షో జరిగింది. డప్పు కళాకారులు, కోలాట నృత్యాలతో వందలాదిమంది బీజేపీ, ఎంఆర్పీఎస్ కార్యకర్తలు రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రింగ్‌రోడ్డు సెంటర్లో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పాలించిన పాలకులు ఖమ్మం జిల్లా అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, దీంతో కనీస సౌకర్యాలైన విద్యా, వైద్యం వంటివి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. సారవంతమైన వ్యవసాయ భూములున్నప్పటికీ వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గురించి పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాని నరేంద్రమోదీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ తనను గెలిపించాలని కోరారు. నన్ను గెలిపిస్తే నరేంద్రమోదీని గెలిపించినట్లేనని చెప్పారు. సభలో బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇస్నేపల్లి అశోక్, దారెల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు గాదె కృష్ణారావు, రాయల రమేష్, చల్లా నాగులు పాల్గొన్నారు.



సామేలు, పద్మ దంపతులు(ఫైల్)

దశదిన కర్మలకు వెళ్లొస్తూ
అనంతలోకాలకు..

- బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్..
- భార్యాభర్తలు మృతి

లక్ష్మీదేవిపల్లి, మే 5: ద్విచక్రవాహనంపై(మోపెడ్) వెళుతున్న దంపతులను టిప్పర్ లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతిచెందిన ఘటన ఆదివారం భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పాల్వంచ మండలం మంచికంటినగర్‌లో కుంపటి సామేలు(57) అతడి భార్య పద్మ(45) నివసిస్తున్నారు. సామేలు దమ్మపేట సెంటర్‌లో చెప్పులు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే దంపతులిద్దరూ టేకులపల్లి మండలం చింతోనిచిలుక గ్రామంలో సమీప బంధువుల దశదిన కర్మల కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా అనిశెట్టిపల్లి క్రాస్‌రోడ్ వద్ద రోడ్డు దాటుతుండగా టేకులపల్లి రోడ్డు వైపునకు వెళుతున్న టిప్పర్ వీరు ప్రయాణిస్తున్న మోపెడ్‌ను ఢీకొనడంతో కుంపటి పద్మకు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడ్డ సామేలును కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. యాక్సిడెంట్‌లో భార్యాభర్తలు మృతి చెందడంతో మంచికంటి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నీట్' పరీక్ష
ప్రశాంతం

- ఐదు కేంద్రాలో 3,179మంది హాజరు
- 81మంది గైర్హాజరు
- ఆలస్యంగా వచ్చి పరీక్ష రాయలేక పోయిన పలువురు విద్యార్థులు
- పరీక్ష అనంతరం గాలివానతో ఇబ్బందులు

5



మధిరలో నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



మధిర, మే 5: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 5గంటలకు హైదరాబాద్ ప్రజా భవన్‌నుంచి ప్రారంభమై రోడ్డుమార్గంలో ఉదయం 9గంటలకు బోనకల్ చేరుకుంటారు. బోనకల్ మండలంలో స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాఘురాంరెడ్డి తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు చింతకాని చేరుకొని మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని సాయంత్రం 6 గంటలకు ముదిగొండ మండలంలో ప్రచారం నిర్వహిస్తారు. భట్టి ఎన్నికల ప్రచారంలో పార్టీ మండల, గ్రామ శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ ఓ ప్రకటనలో కోరింది.

వారు రానివ్వరు.. వీరు నమ్మరు

- పార్టీ మారే నాయకులకు 'లోకల్' బ్రేకులు
- సత్తుపల్లి సెగ్మెంట్‌లో చేరికలకు అడ్డంకులు

5



గాలిదుమారానికి ఇల్లెందు మండలంలో నేలకూలిన విద్యుత్‌స్తంభం, తాటిచెట్టు

కాసింత ఉపశమనం

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల గాలివాన

- మధ్యాహ్నం 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత
- సాయంత్రం గాలిదుమారంతో తేలికపాటి వర్షం

ఖమ్మం, మే 5(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా మాడుపగిలిపోయే ఎండలతో అల్లాడుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు ఆదివారం సాయంత్రం కాస్తంత ఉపశమనం లభించింది. గడిచిన రెండు రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు మండలాల్లో మోస్తరు వర్షపాతం నమోదవుతుండగా ఆదివారం ఖమ్మం నగరంతోపాటు జిల్లాలోని పలుచోట్ల ఉరుములు మెరుపులతో ఈదురుగాలు వీచాయి. దాంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు తోడు తేలికపాటి జల్లు కురవడంతో వాతావరణం చల్లబడింది. ఖమ్మం జిల్లాలోని కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం, వైరా, చింతకాని, బోనకల్, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయాపాలెం మండలాల్లో గాలివాన కురిసింది. అయితే ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రంగానే ఉంది. ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 44.4 అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తగూడెం జిల్లాలో భద్రాచలంలో 44.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం ఈ జిల్లాలోని గుండాల, ఇల్లెందు మండలాల్లో గాలిదుమారంతో వర్షం కురిసింది.



ఆందోళనకారులను సముదాయిస్తున్న ఎమ్మెల్యే రాందాస్



కాంగ్రెస్‌లో జరిగిన చేరికలు

కొణిజర్ల కాంగ్రెస్‌లో
చేరికల రగడ

- ఎమ్మెల్యే ప్రైవేట్ కార్యాలయం ముందు రసాభాస
- మధ్యాహ్నం వాయిదా.. సాయంత్రం చేరికలు

వైరా, మే 5: వైరా నియోజకవర్గ పరిధిలోని కొణిజర్ల మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరికలపై ఆదివారం రోజంతా హైడ్రామా నడిచింది. దీనికి వేదిక వైరాలోని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రైవేట్ క్యాంపు కార్యాలయం అయింది. మధ్యాహ్నం వరకు చేరికలపై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న కాంగ్రెస్ నాయకత్వం సాయంత్రానికి అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ చేరికల ప్రక్రియను పూర్తిచేసింది.

కొణిజర్ల మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.చిరంజీవి, సొసైటీ అధ్యక్షుడు చెరుకుమల్లి రవిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి వీల్లేదని ఆ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాందాస్ క్యాంపు కార్యాలయం ముందు ఆందోళన చేశారు. దాదాపు గంటసేపు పరిస్థితి రసాభాసగా మారి గందరగోళం ఏర్పడింది. ఎమ్మెల్యే గన్‌మెన్‌ను కూడా కార్యకర్తలు నెట్టివేశారు. ఒక దశలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్వయంగా రంగప్రవేశం చేసి ఆందోళనకారులను నెట్టివేసి గందరగోళ పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

చిరంజీవి, రవి వైరాలోని ఎమ్మెల్యే ప్రైవేట్ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమాచారం అందుకున్న కొణిజర్ల మండలానికి చెందిన ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాయల పుల్లయ్య, కె.వెంకటేశ్వర్లు, పెద్దమునగాల మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీను, పలువురు నాయకులు మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వైరాకు చేరుకున్నారు. కార్యాలయంలో టెంట్లను కూల్చివేసి కుర్చీలు విసిరివేశారు. కరెంట్ ఫీజులు పీకి సరఫరా నిలిపివేశారు. గొల్లపూడిలో చేరికల ప్రక్రియను ముగించుకొని వైరా చేరుకున్న ఎమ్మెల్యే రాందాస్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌ను అడ్డుకొని ఆందోళన చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిన చిరంజీవి, రవిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేతో వాదనకు దిగారు. ఆ ఇద్దరి చేరికలను ప్రోత్సహిస్తున్న కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే నారాయణపై దాడిచేసేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఆసమయంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా రాజశేఖర్, వైరా నాయకులు కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి తదితరులు మిన్నకుండిపోగా సమయస్ఫూర్తితో ఎమ్మెల్యే పరిస్థితిని చక్కదిద్దారు. చేరికల అభ్యంతరాలపై నలుగురితో చర్చించి నిర్ణయం తీసుకుందామని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. అభ్యంతరాలు ఉన్న వారిని చేర్చుకోబోమని సర్దిచెప్పారు. అప్పటిదాకా ఆగ్రహంతో ఊగిపోయిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఫొటోలు దిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అయితే ఆ కొద్దిసేపటికే సీన్ మారిపోయింది. బీఆర్‌ఎస్ నుంచి చేరికలకు సిద్ధమైన చిరంజీవి, రవి తమ అనుచరులతో ఎమ్మెల్యే ప్రైవేట్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అదే మండలంలోని కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీ గోసు మధు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే నారాయణ, నాయకుడు రాంపూడి రోశయ్య తదితరులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్ ఆదేశాలు ఉన్నందున కాంగ్రెస్‌లో చేరికలకు అభ్యంతరాలున్నా పరిగణలోకి తీసుకోబోమని డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. అదే సమయంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేకంగా సమావేశమై అప్పటివరకు జరిగిన పరిణామాలపై సీరియస్‌గా చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చినవారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవాల్సిందేనని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యేకు స్పష్టం చేశారు. ఆతర్వాత చిరంజీవి, రవి సహా ఆమండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి పార్టీలు కండువాలు కప్పారు.

పకడ్బందీగా ఈవీఎంల కమీషనింగ్



కలెక్టర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మధిర, మే 5: ఈవీఎం యంత్రాల కమీషనింగ్‌ను పగడ్బందీగా చేపట్టాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ గౌతమ్ ఎన్నికల, పోలీస్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కూడా అయిన కలెక్టర్ ఆదివారం సాయంత్రం ఖాజీపురంలోని మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి అందులో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్ల కమీషనింగ్, బాలెట్ బాక్సులు పరిశీలించారు. మధిర అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 268 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సరిపడా ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులు, వీవీ ప్యాట్ల బద్రతను తనిఖీ చేశారు. భద్రత విషయంలో అధికారులకు కొన్ని సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ల ఫెసిలిటేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. పోలింగ్ పక్రియ చేపడుతున్న తీరు, ఎంతమంది పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకుంది అడిగి తెలుసుకున్నారు. భద్రతా పరమైన ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మధిర ఏఆర్‌వో, ఆర్‌డీవో గణేష్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ మధు, రూరల్ ఎస్‌ఐ లక్ష్మీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ వాహనం తనిఖీలు

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మధిర వచ్చిన కలెక్టర్ గౌతమ్, ఆయనతో పాటు వచ్చిన ఇతర వాహనాలను మధిర ఆత్కూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు.

స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి



సత్తుపల్లిలో 2కే రన్

సత్తుపల్లిరూరల్, మే5: ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సత్తుపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 2024పార్లమెంట్ ఎన్నికల గురించి సత్తుపల్లి పట్టణంలో ఏర్పాటుచేసిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఒక్క ఓటుతో ఎంతోమంది జీవితాలు మార్చేందుకు అవకాశమున్నందున ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగపరచుకోవాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ఓటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించారని, నిర్ధేశించిన వారికి ముందుగానే హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఇప్పటికే సాగుతుందన్నారు. మే 13న ఓటేద్దాం.. మీ భవిష్యత్ మీ ఓటు.. మీ ఓటు మీ బాధ్యత అంటూ వేంసూర్ రోడ్‌లోని నీలాద్రి అర్బన్ పార్క్ నుంచి మాధురీ ఫంక్షన్ హాల్ వరకు ఈ 2కే రన్ సాగింది.

కరుణించు దేవా..



ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరి చర్చిలో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు అన్నారు. -ఖమ్మం రూరల్

వెయ్ దరువేయ్..



ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు డప్పుపై దరువేసి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. తల్లాడ మండలంలో ఆదివారం రోడ్‌షోలో పాల్గొన్న ఆయన సరదాగా కళాకారులతో కలిసి డప్పు వాయించారు. - తల్లాడ

ఓట్ల పూరీలు..



బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం వినూత్న ప్రచారం నిర్వహించారు. నగరంలోని 49వ డివిజన్‌లో పూరీలను కాలుస్తూ ఓట్లు అడిగారు. - ఖమ్మం కార్పొరేషన్

అయ్యయ్యో.. రామయ్యా !

- ఆయన గెలిస్తే ముందుస్తు ఎన్నికలు రావాల్సిందే..



మాజీ ఎంపీ రామయ్య

భద్రాచలం, మే 5: ఆయన గెలిస్తే కేంద్రంలో ముందుగానే ఎన్నికలు.. ఇలా ఒకసారి.. రెండుసార్లు కాదు మూడుసార్లు నిర్ణీత సమయం కంటే ముందే ఎన్నికలొచ్చాయి. ఇలా జరగడం యాదృశ్చికమే అయినా ఆయన గెలిచిన ప్రతిసారి ముందస్తుగా ఎన్నికలు వచ్చాయి. ఈ విధంగా భద్రాచలం లోక్‌సభ మాజీ సభ్యులు సోడే రామయ్య విషయంలో జరిగింది. 1967లో భద్రాచలం లోక్‌సభస్థానం ఏర్పడింది. అయితే 1984లో సోడే రామయ్య సీపీఐ నుంచి పోటీ చేసి గెలిచారు. ఈ సమయంలో ఆయన అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ బోఫోర్సు కుంభకోణానికి బాధ్యుడిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనికి రాజీవ్‌గాంధీ తిరస్కరించినందుకు నిరసనగా రాజీనామా చేశారు. ఆ సమయంలో 1989లో పార్లమెంటుకు ముందుగానే ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఆయన పోట చేసి ఓటమి పాలయ్యారు. కాగా 1996లో మళ్లీ సీపీఐ తరఫున పోటీ చేసిన సోడే రామయ్య భద్రాచలం ఎంపీగా విజయం సాధించారు. ఆ నాడు మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. 1998లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సోడేరామయ్య మళ్లీ ఎంపీగా గెలుపొందగా కేవలం 13 నెలలు మాత్రమే ఎంపీగా పని చేశారు. దీంతో సోడే రామయ్య భద్రాచలం లోక్‌సభ నుంచి మూడుసార్లు వివిధ సందర్భాల్లో గెలిచినా ముందస్తుగానే ఎన్నికలు రావడం గమనార్హం. ఇది యాదృశ్చికమే అయినా సోడే రామయ్య గెలిస్తే ముందస్తు ఎన్నికలొస్తాయనే ప్రచారం గతంలో భద్రాచలం ఏజెన్సీలో వినపడేది.



టీడీపీ సానుభూతి ఓటర్లపై
అభ్యర్థుల గురి

- పసుపు ఓట్లపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఆశలు
- సత్తుపల్లి సెగ్మెంట్‌లో భారీగా 'దేశం' ఓట్లు

సత్తుపల్లి, మే 5: సత్తుపల్లి నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల ఓటర్లపై ప్రస్తుతం ఖమ్మం లోక్ సభకు పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు దృష్టి సారించారు. సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీల మధ్యనే పోటీ జరగ్గా ఆ రెండు పార్టీల అభ్యర్థులు గెలుపొందుతూ వచ్చారు. బీఆర్‌ఎస్ పోటీ చేసినా ఇప్పటి వరకూ ఆ పార్టీ అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందలేదు.

2009, 2014, 2018 ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య హాట్రిక్ విజయం సాధించారు. 2009లో సండ్ర వెంకటవీరయ్య టీడీపీ అభ్యర్థిగా 79,491 (42.65శాతం) ఓట్లు సాధించి గెలుపొందారు. 2014లో సండ్ర వెంకవీరయ్య టీడీపీ నుంచి 75,490 (39.53శాతం) ఓట్లు సాధించారు. 2018లో మహాకూటమిలో కాంగ్రెస్ మద్దతుతో టీడీపీ అభ్యర్థిగా ఉన్న సండ్ర వెంకటవీరయ్యకు 1,00,044 (50.46) శాతం ఓట్లుతో విజయం సాధించారు. ఆది నుంచి ఈ నియోజకవర్గంలో టీడీపీకి భారీ ఓటు బ్యాంకు ఉంది. రాష్ట్ర విభజన తరువాత కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీడీపీ 2018లో అశ్వారావుపేట, సత్తుపల్లిలలో గెలుపొందింది. గెలుపొందిన ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరటంతో టీడీపీ నాయకత్వపరంగా బలహీనపడింది. అయినా ఆ పార్టీకి సానుభూతి పరుల ఓటు బ్యాంకు మాత్రం అదే స్థాయిలో ఉంది. టీడీపీ నాయకులు అనేక మంది బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లలో చేరిపోయారు. కొందరు నాయకులు టీడీపీలో ఉండిపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి అసెంబ్లీ నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయికి టీడీపీ సానుభూతి పరులు మద్దతుగా నిలిచారు. టీడీపీ నాయకులు కూడా బహిరంగంగా ప్రచారం నిర్వహించారు.

ప్రస్తుత ఎన్నికల్లో....

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సత్తుపల్లి సెగ్మెంట్‌లో టీడీపీ నాయకుల మద్దతు కోసం పలు పార్టీలు పావులు కదుపుతున్నాయి. వాస్తవంగా పక్క రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తూండగా ఇక్కడ మాత్రం బీజేపీతో టీడీపీ నాయకులు కలసి పని చేయని పరిస్థితి ఉంది. తమ పార్టీని తెలంగాణాలో బీజేపీ నాయకత్వం పట్టించుకోలేదని సత్తుపల్లి సెగ్మెంట్‌లోని నాయకులు బహిరంగంగా చెపుతున్నారు.

ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో మద్దతు ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షులతో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సమావేశమై కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు. రెండు రోజులు వేచి చూసి తాము నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది. ఇక టీడీపీ నాయకులు మద్దతు ఇవ్వాలని బీజేపీ అభ్యర్థి వినోదరావు కూడా వారిని కోరారు. నాయకులను కాకుండా పార్టీలో క్రింది స్థాయి కేడర్‌తో పాటు, గణనీయంగా ఉన్న టీడీపీ సానుభూతి ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు అభ్యర్థి నామా నాగేశ్వరరావుతోపాటు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో టీడీపీలో నామా నాగేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య సుదీర్ఘకాలం ఉన్నారు. ఈ క్రమంలో టీడీపీ సానుభూతి పరులతో ఉన్న సంబంధాలను దృష్టిలో ఉంచుకొని వారి ఓటు బ్యాంకుపై దృష్టి సారించారు. మొత్తంగా సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న టీడీపీ సానుభూతి ఓట్లపై ప్రధాన పార్టీలు కన్నేశాయి.

లోక్‌సభ ఎన్నిక..
వైరా ఎమ్మెల్యేకు తొలిపరీక్ష



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మే 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నిక వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శక్తిసామర్థ్యాలకు తొలి పరీక్షగా మారింది. గత ఏడాది నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన రాందాస్‌నాయక్ ఈ ఎంపీ ఎన్నికల్లో తమ సత్తా చాటి తన ప్రతిష్ఠను చాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైరా అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలోనే రాందాస్‌నాయక్‌కు 33,045ఓట్ల భారీ మెజార్టీ లభించింది. కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్న సమయంలో అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థిపై భారీ మెజార్టీతో గెలిచిన రాందాస్‌నాయక్ ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేగా తన శక్తిసామర్థ్యాలను చాటుకోవాల్సి ఉంది. ఖమ్మం ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి ఈ వైరా అసెంబ్లీ నియోజకవర్గంలో భారీ మెజార్టీని తీసుకురావాల్సిన అవసరం ఎమ్మెల్యే భుజస్కందాలపై పడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాందాస్‌నాయక్‌కు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ఓటర్లు మెజార్టీ కట్టబెట్టారు. ఇప్పుడు ఐదుమండలాల్లో కూడా ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీని సాధించటం ఎమ్మెల్యేకు అగ్నిపరీక్షగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో రాందాస్‌నాయక్‌కు 93,913ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌కు 60,868ఓట్లు లభించాయి. 33,045ఓట్ల ఆధిక్యత వచ్చింది. ఖమ్మం ఎంపీ టిక్కెట్‌ను అనేకమంది కాంగ్రెస్ నాయకులు ఆశించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు మద్దతుదారుడిగా ఉన్న రాందాస్‌నాయక్ ఖమ్మం టిక్కెట్ ఆశించిన భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందినికి మద్దతుగా ఉన్నారు. అయితే నందినికి ఎంపీ టిక్కెట్ రాలేదు. ఆతర్వాత తనకు మొదటి నుంచి రాజకీయాల్లో అన్నివిధాలుగా అండదండగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఖమ్మం ఎంపీ టిక్కెట్ ఆశించగా ఆయనకు టిక్కెట్ కోసం రాందాస్ తనవంతు మద్దతునిచ్చారు. నందినికి, పోట్లకు ఎంపీ టిక్కెట్ రాకపోవడంతో రాందాస్ కొంతమేర నిరాశ చెందారు.

ఈ నాలుగునెలల కాలంలో రాందాస్ హైదరాబాద్‌లో ప్రభుత్వ రాజకీయ కార్యక్రమాల నిమిత్తం ఎక్కువరోజుగడిపారు. జిల్లాకు చెందిన రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం ఖమ్మం ఎంపీ టిక్కెట్ కట్టబెట్టింది. అంతకంటే కొద్దిరోజుల ముందే పొంగులేటితో కలిసి వైరాలో కాంగ్రెస్ కార్యకర్తల సమన్వయ సమావేశాన్ని ఒక్కసారి మాత్రమే నిర్వహించారు. వైరా నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గాలు పోటాపోటీగా ఉన్నాయి. పొంగులేటి వర్గీయుడికి ఎంపీ టిక్కెట్ రావడంతో ఆవర్గం వారితోపాటు మిగిలిన మూడు వర్గాల వారిని ఎమ్మెల్యే సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన రాజకీయ పరిస్థితి నెలకొని ఉంది.

ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజార్టీఓట్లను కాంగ్రెస్ వర్గాల సమన్వయంతో రాందాస్ ఎంతమేర సాధిస్తారో వేచిచూడాల్సి ఉంది. అయితే ఈ ఎన్నికల్లో సీపీఐతోపాటు సీపీఎం కూడా కాంగ్రెస్‌తో కలిసి వస్తుండటం వారిని కూడా సమన్వయం చేసుకోవాల్సి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం శ్రేణులు రాందాస్‌నాయక్‌కు సంపూర్ణ మద్దతునిచ్చి కాంగ్రెస్ వర్గాల కంటే మిన్నగా అన్నీ తామేఅయి ఆయన గెలుపులో కీలకంగా వ్యవహరించారు. ఇప్పుడు ఎన్డీయే కూటమిలో టీడీపీ భాగస్వామ్యపక్షం అయినప్పటికీ తెలంగాణలో ఎవరికి మద్దతుపై టీడీపీ ఇంకా ఆపార్టీ శ్రేణులకు స్పష్టత నివ్వకపోవడం కొంత మైనస్ అయ్యే అవకాశముంది. అనుకూల, ప్రతికూల పరిస్థితులను అధిగమించి వైరాలో మెజార్టీ సాధించటం రాందాస్‌కు కత్తిమీద సాములా మారింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో మండలాల వారీగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు వచ్చిన ఓట్లు ..

మండలం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	మెజార్టీ
సింగరేణి	20,283	14,763	5,530
జూలూరుపాడు	12,253	9,784	2,469
ఏన్కూరు	14,155	8,205	5,950
కొణిజర్ల	24,617	15,148	9,469
వైరా	21,089	12,566	8,523
పోస్టల్ బ్యాలెట్	1516	412	104
మొత్తం ఓట్లు	93,913	60,868	33,045



ఓటు అభ్యర్థిస్తున్న సింగరాజు

ఆటో రాజు..

- వినూత్న ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి

బూర్గంపాడు, మే 5: ఊరూరా ఆటోలో తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు మహబూబాబాద్ పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థి పాయం సింగరాజు. బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాయం సింగరాజు సారపాకలో ఉంటూ ఐటీసీలో క్యాజువల్‌గా, ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తనను గెలిపించాలని కోరుతూ తన ఆటో నడుపుకుంటూ ఊరూరా తిరుగుతూ...ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన అవినీతిని నిర్మూలించి సామాన్యుల సమస్యలు పరిష్కారం చేసి, వ్యవస్థలను వారి దగ్గర చేయడం కోసం తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

ఖమ్మం నగరంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

- బీఆర్‌ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా

వైరా/ కొణిజర్ల/ తల్లాడ, మే5: మహిళలకు ఉచిత బస్‌ప్రయాణం తప్పా.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలులో ఏదీ అమలుకాలేదని, మరోసారి మోసం చేసేందుకు వస్తున్న నాయకులను నిలదీయండని బీఆర్‌ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రజలను కోరారు. నామా చేపట్టిన రోడ్‌షో ఆదివారం రాత్రి కొణిజర్ల నుంచి వైరాకు చేరుకుంది. ఈ సందర్భంగా వైరా, కొణిజర్లలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పువన్ని మోసపూరిత మాటలేనని విమర్శించారు. బీఆర్‌ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు దూరంకాకుండా ఉండేందుకు పార్లమెంట్‌లో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని వారు కోరారు. కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషణం, వైరా ఇన్‌చార్జ్ బానోతు మదన్‌లాల్, కొణిజర్ల జడ్పీటీసీ సభ్యురాలు పోట్ల కవిత, పోట్ల శ్రీనివాసరావు, బోడపోతుల బాబు, దేరంగుల బ్రహ్మం, చల్లా మోహన్‌రావు, పాముల వెంకటేశ్వర్లు, భూక్యా నరసింహనాయక్, బానాల వెంకటేశ్వర్లు, ముళ్లపాటి సీతరాములు, కట్టా కృష్ణార్జునరావు, మద్దెల రవి పాల్గొన్నారు.

తల్లాడలో... కుర్నవల్లిలో ఆదివారం రాత్రి బీఆర్‌ఎస్ ప్రచారం జరిగింది. ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రసంగించారు. బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

రూ.రెండులక్షల రుణమాఫీ చేస్తాం

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు, మే 5: ఆగస్టు 15లోపు రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీ చేసి తీరుతామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాగమయి వేంసూరు మండలం మర్లపాడులో ఆదివారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలుచేయటం జరిగిందని ఆగస్టు 15లోపు రైతులకు రూ.రెండులక్ష రుణమాఫీ అమలుచేసి చూపిస్తామని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి రఘురామిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు లోపాయికారి ఒప్పందం చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. తనను పార్లమెంట్‌కు పంపిస్తే ఖమ్మం జిల్లా అభివృద్ధి పథంలో నిలుపుతానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, బండి గురునాథరెడ్డి, అర్వపల్లి గోపాలరావు, బండి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి

- ధర్మరక్షణ చైర్మన్ ఫౌండర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు చికోటి ప్రవీణ్



మాట్లాడుతున్న ప్రవీణ్

ఖమ్మం బైపాస్‌రోడ్, మే 5: దేశం అభివృద్ధి చెందాలంటే ఒక్క నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని ధర్మరక్షణ చైర్మన్ ఫౌండర్, రాష్ట్ర బీజేపీ నాయకుడు చికోటి ప్రవీణ్ అన్నారు. నగరంలోని ఓ కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఆర్యవైశ్య సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ మోదీతోనే సాధ్యమవుతుందని, ప్రపంచ దేశాలలో భారతవానిని అగ్రగామిగా నిలుపుకోవటం కోసం దేశంలో సుస్థిర శక్తివంతమైన దేశభక్తి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మోదీ లాంటి వ్యక్తులు ప్రధానిగా ఉండటం ఎంతో అవసరమని, అందుకు ఖమ్మం జిల్లా పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు లాంటి వ్యక్తులు పార్లమెంట్‌లో ఉండాలని అన్నారు. ఎన్నో సేవలుచేసిన తాండ్ర వినోద్‌రావు లాంటి వ్యక్తులను పార్లమెంట్‌కు పంపిస్తే ఖమ్మం జిల్లా కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర వినోద్‌రావు, ఆయన సతీమణి వినీలరావు, ఆర్యవైశ్య సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పలశారద, వేణుగోపాల్, సన్నే ఉదయప్రతాప్, వెంకటగుప్తా, వీరవల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



గాలివాన బీభత్సం

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, ▸ వడగళ్లవాన, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- కారేపల్లిలో పిడుగుపాటుకు ఇద్దరికి తీవ్ర గాయాలు ▸ గుండాల మండలంలో పిడుగుపడి మూడు పశువుల మృత్యువాత

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం గాలివాన బీభీత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగింది. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం సంబవించింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి.

కారేపల్లి మే 5: మండలంలో ఆదివారం ఉరుములతో కూడిన వడగళ్లవర్షం కురిసింది. గాలిదుమారంతోపాటు ఉరుములు, మెరుపులతో కుడిన వర్షంపడింది. గాలి దుమారా నికి అనేక గ్రామాల్లో విద్యుత్‌స్తంబాలు నేలకూలాయి. జామలపల్లి వద్ద పిడుగుపాటుతో ఇద్దరు వ్యక్తలు షాక్‌కు గురై య్యారు. వారిని స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మండంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు చీకటిలోనే ఉన్నారు.



చింతకానిలో ధాన్యంపై పట్టాలు

ఉరుములు, మెరుపులతో వర్షం

కొణిజర్ల ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గాలిదుమారంతో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఈదురగాలులకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిం ది. పెద్దగోపతి, తనికెళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యు త్ సిబ్బంది విద్యుత్‌ను పునరుద్దరించేందుకు ప్రయ త్నిస్తు న్నారు. ఏఈ సురేష్ సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటి కప్పుడు లైన్‌మరమ్మతులను చేపించేందుకు కృషి చేస్తున్నారు.

గుండాలలో వడగళ్లవాన

●గుండాల/ఇల్లెందు రూరల్: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో వర్షంతో పాటు వడగళ్ల కురిసింది. మండల కేంద్రంలో ఇళ్ల పక్కనే చెట్లపై పిడుగులు పడ్డాయి. దామరతోగు గ్రామంలో చెట్టుపై పిడుగు పిడుగు పడటంతో భిక్షపతి, ఎర్రయ్య అనే రైతులకు చెందిన మూడు పశువులు మృతి చెందాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గాలి దుమారంతో మామిడి కాయలు నేలరాలాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

●ఇల్లెందు మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని ఉమ్మడి చల్లసముద్రం గ్రామపంచాయతీ, మాణిక్యారం. మామిడి గుండాల, మిట్టప ల్లి, రొంపేడు గ్రామ పంచాయితీల్లో రాళ్ల వర్షంతోపాటు రాళ్లవాన దంచికొట్టింది. దీంతో ఎక్కడికక్కడికి చెట్లు విరిగి పడ్డాయి, విద్యుత్ స్తంబాలు నేల కూలాయి.

అకాల వర్షంతో రైతుల అవస్థలు

చింతకాని: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్లతో కూడిన అకాల వర్షానికి కల్లాల్లో ఉన్న మొక్కజొన్న రాసులను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈదురుగాలులకు పలు చోట్ల భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. అరకొర నీటితో పండించిన పంట చివరకు అకాల వర్షాలకు తడవడంతో రైతులు మరింత ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మునలమ్మ ఆలయంలో చెట్టుపై పిడుగు

●కరకగూడెం: మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. చొప్పాల పంచాయతీ చొప్పాల గ్రామంలోని ముసలమ్మ ఆలయంలో దాదాపుగా 500 ఏళ్లకు పైగా ఉన్న వేప చెట్టుపై పిడుగు పడింది. సమాచారం అందుకున్న ఫైరింజన్ అగ్నిమా క సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు.

గాలి దుమారానికి విద్యుత్ అంతరాయం

●ఖమ్మం సంక్షేమవిభాగం: గాలి దుమారానికి ఖమ్మం నగరంలోని విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 10గంటల వరకు నగర ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తప్పలేదు. ముఖ్యంగా ఖానా పురం, పాండురంగాపురం, బల్లేపల్లి, జయనగర్, బాలపేట, ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరంతరాయంగా గంటల తరబడి కరెంట్ పునరుద్దరణ జరగక పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. ఎస్ఈ సురేందర్ పనులను పర్యవేక్షించారు.

కూలిన రేకుల ఇళ్లు, విద్యుత్ స్తంభాలు

ఖమ్మం రూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడా వడగళ్ల వర్షం పడింది. వెంకటగిరి, గుడిమళ్ల, నంద్యాతండా గ్రామాల పరిదిలో విద్యుత్తు స్తంబాలు నేలకొరిగాయి. సుమారు 20 విద్యుత్తు స్తంబాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. నంద్యాతండాలో మూడు ఇళ్లపై కప్పులు గాలికి ఎగిరిపోయాయి. విద్యుత్తు అధికారులు వెంటనే అప్రమత్తమయి విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. అధికారులు మరమ్మతు పనులు ప్రారంబించారు.





ఖమ్మం రూరల్‌లో ధ్వంసమైన ఇల్లు, కారేపల్లి మండలంలో పిడుగుపాటుకు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం, ఇల్లెందు మండలంలో నేలకూలిన చెట్లు

జానకీ సదనం ఉదంతంపై విచారణ షురూ

- విచారణాధికారిగా దేవాదాయ శాఖ ఏడీసీ కృష్ణవేణి

భద్రాచలం, మే 5: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం పరిధిలోని జానకీసదనం ఉదంతంపై ఎట్టకేలకు విచారణ షురూ అయింది. భద్రాద్రి దేవస్థానంలో జానకీసదనం నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామంటూ దేవస్థానంలోని ఓ అధికారి, మరో వ్యక్తి (బిల్డరుగా పరిచయం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు) సహకారంతో తమను మోసం చేశారని ఆరోపిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు, భద్రాద్రి దేవస్థానం ఈవోకు హైదరాబాద్‌కు చెందిన ట్రస్టు సభ్యులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఈవో శ్రవణ్‌కుమార్‌కు ఈ విషయమై వివరణ ఇవ్వాలని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మెమో జారీ చేశారు. ఈ క్రమంలో జానకీ సదనం ఉదంతంపై దేవాదాయ శాఖ కమీషనర్‌కు, భద్రాద్రి జిల్లా కలెక్టరుకు దేవస్థానం అధికారులు నివేదిక ఇప్పటికే పంపారు. తాజాగా ఈ విషయంపై క్షేత్రస్థాయిలో విచారించేందుకు దేవాదాయ శాఖ అదనపు కమీషనర్ ఎస్ఎండీ కృష్ణవేణిని విచారణ అధికారిగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు నియమించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఏడీసీ జానకీసదనం ఉదంతంపై అంతర్గతంగా విచారణ నిర్వహిస్తున్నారు. ఈ ఉదంతంలో ఉన్నవారితో పూర్తి వివరాలను ఆమె సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

కేసీఆర్‌ను ప్రజలు నమ్మరు

- బీఆర్ఎస్- బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ▸ మహబూబాబాద్ ఎన్నికల ప్రచారంలో మంత్రి తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మహబూబాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని, లోన ఒకటి.. బయట మరొకటి మాట్లాడుతున్న అబద్ధాల మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మరని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పదేళ్ల విధ్వంసానికి పాల్పడిన కేసీఆర్‌ను ఇంటికి సాగనంపిన విధంగా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న ప్రధాని మోదీని గద్దెదించాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో ఎన్నికల సభను నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి బీజేపీ, బీఆర్ఎస్‌లపై విరుచుకుపడ్డారు. దేశ రక్షణ, ప్రజల బాగోగుల కోసం ఇండియా కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గోదావరి జలాల సాధన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు.

అధికారంలో కొనసాగే నైతికత బీజేపీకి లేదు: సీపీఎం

దేశంలో ప్రజల మధ్య మతాల చిచ్చు పెడుతున్న బీజేపీకి అధికారంలో కొనసాగే నైతికత లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుంకరి వీరయ్య అన్నారు. దేశభక్తి ముసుగులో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.

పచ్చని తెలంగాణను ఎడారిలా మార్చిన కేసీఆర్

మరిపెడ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ దేశంలోనే ఆదర్శరాష్ట్రంగా మారుతుందని వ్యవయసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని గాలివారిగూడెం వద్ద ఉన్న ఏఎన్ఆర్ గార్డెన్‌లో మానుకోట పార్లమెంట్ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ ఎన్నికలు తర్వాత మిగతా పథకాలను అమలుచేస్తామన్నారు. అన్నీ మండలాల అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వీరయ్య

సింగరేణి కార్మికుల పనివేళల్లో మార్పులు

కొత్తగూడెం టౌన్, మే 5: మండుతున్న వేసవి ఎండలతో అల్లాడి పోతున్న సింగరేణి కార్మికులకు యాజమాన్యం పనివేళల్లో మార్పులు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 6తేదీనుంచి కార్మికుల పనివేళలను ఈనెల 31వరకు మార్పులు చేశారు. ఉదయం షిఫ్టు 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం 4గంటలనుంచి రాత్రి 12 గంటల వరకు, రాత్రి షిఫ్టు అర్ధరాత్రి 11 గంటలు నుంచి ఉదయం 7గంటల వరకు మార్పులు చేయగా జనరల్ షిఫ్టును ఉదయం 6 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మార్పులు చేస్తూ సింగరేణి యాజమాన్యం మైన్స్, ఓపెన్ కాస్టుల వద్ద నోటీసులను అంటించారు. ఓపెన్ కాస్టులో పనిచేస్తున్న కార్మికులనకు వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు మజ్జిగ ప్యాకెట్స్‌తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌ను పంపిణీచేస్తున్నారు. ఓపెన్ కాస్టుల్లో వేసవి వేడిని తట్టుకునే విదింగా కార్మిక పని ప్రదేశాల్లో చలువ పందిళ్లను ఏర్పాటుచేసి వాట్‌ను వెదజల్లే కార్యక్రమాన్ని చేస్తున్నారు. గత కొంత కాలంగా ఎండల తీవ్రత వల్ల కార్మికులు అధిక శాతం మంది విదులకు గైరుహాజరు కావడం ఎండ తీవ్రత వల్ల పనివేళ్లల్లో మార్పులు చేయాలని పలు కార్మిక సంఘాలు, కార్మికుల విజ్ఞప్తి మేరకు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలకు ఉత్తర్వులను విడుదల చేశారు.

వడదెబ్బతో బాలుడి మృతి



సంజయ్

భద్రాచలం, మే 5: వడదెబ్బతో ఆదివారం ఓ బాలుడు మృతి చెందిన సంఘటన భద్రాచలంలో జరిగింది. భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన చింతకాయల సంజ య్(14) ఎండదెబ్బ తగలడంతో వాంతులు, విరోచనాలు బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు ఏరియా వైద్య కోసం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యు లు, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాలుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి మృతదేహం లభ్యం



రాము(ఫైల్)

పెనుబల్లి, మే 5: కన్పించకుండా పోయిన వ్యక్తి మృతదేహం ఆదివారం బయ్యన్నగూడెం చెరువు సమీపంలో లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరయ్యబంజర్ తండాకు భూక్యా రాము (44)ఈనెల 3న వీఎంబంజర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరై ఆతర్వాత కన్పించకుండాపోయాడు. కుటుంబసభ్యులు బంధువులను, తెలిసిన వారిని ఆచూకీ కోసం ప్రయత్నించగా ఆచూకీ లభించకపోవడంతో వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బయ్యన్నగూడెం పెద్ద చెరువు సమీపంలో ఓవ్యక్తి మృతదేహాన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులకు కన్పించకుండాపోయిన సూరయ్యబంజర్ తండాకు చెందిన రాముగా గుర్తించారు. సమావేశం అనంతరం వడదెబ్బకు గురై కాలకృత్యాలు తీర్చుకొనేందుకు చెరువు వద్దకు వెళ్లి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

● మణుగూరు విఠల్‌నగర్‌లో ఘటన

మణుగూరు, మే5: సింగరేణి కార్మికుడిపై హత్యాయత్నం జరిగిన సంఘటన మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని విఠల్‌వునగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపనకుంట ప్రాంతానికి చెందిన కుర్రం నాగేశ్వరరావు అనే వ్యక్తికి, సింగరేణి మల్లేమల్లి ఇన్‌టేక్‌వెల్ వద్ద సివిల్‌డిపార్టుమెంట్‌లో పని చేసే గుగులోతు మురళి అనే వ్యక్తికి మధ్య గతంలో కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ క్రమంలో పాత ఘర్షణల నేపథ్యంలో మురళిని నాగేశ్వరరావు కత్తితో ఆదివారం దాడి చేశాడు. ఈ దాడిలో మురళి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆతడిని హుటాహుటినా మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈవిషయంపై పోలీసులను వివరణ కొరగా తమకు ఈ దాడి విషయంలో ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

బోనకల్, మే5: ఖమ్మం బస్టాండ్ సెంటర్లో గల రెండు దుకాణాల్లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. చిరునోముల గ్రామానికి చెందిన నర్సింగుల వెంకటరమణ ఫ్యాన్సీ దుకాణం, పక్కనే రాజు పాల విక్రయ కేంద్రాన్ని రోజు మాదిరిగా శనివారం రాత్రి దుకాణాలను బంద్ చేసి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణాల తలుపులను పగులగొట్టి ఫ్యాన్సీ దుకాణంలో రూ.5వేల నగదుతో పాటు 54 వేల విలువ చేసే సామాగ్రిని, పాల విక్రయ కేంద్రంలో రూ.20వేల నగదును చోరీ చేశారు. ఈ సంఘటన పై బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీసీఎస్ సీఐ బాలజీ, ఎస్ఐ మధుబాబులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో ఫర్నిచర్ దగ్ధం

ఖమ్మం క్రైం, మే 5: విద్యుదాఘాతంతో ఫర్నిచర్ దగ్ధమైన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని పాత మునిసిపాలిటీ కార్యాలయం సమీపంలో ఓ కమర్షియల్ బిల్డింగ్‌లో ఆదివారం సాయంత్రం గాలిదుమ్ము వస్తున్న సమయంలో విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బిల్డింగ్‌లోని మూడో అంతస్తులో ఉన్న ఫర్నీచర్ ధ్వంసం అయింది. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనాస్థలం వద్దకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా ఈ ప్రమాద సమీపంలో పిడుగు పడటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

వారు రానివ్వరు.. వీరు నమ్మరు

- పార్టీ మారే నాయకులకు 'లోకల్' బ్రేకులు ▸ స్థానిక నాయకుల అనుమతితోనే కాంగ్రెస్‌లో చేరికలు
- సత్తుపల్లి సెగ్మెంట్‌లో చేరికలకు అడ్డంకులు ▸ పార్టీ మారాలనుకుంటున్న వారికి షాక్
- రెండు పార్టీలకూ దూరమవుతున్న పలువురు నేతలు



సత్తుపల్లి, మే 5: సాధారణంగా రాష్ట్రంలో అధికారం మారితే నాయకుల జంపింగ్‌లు సర్వసాధారణం.. కానీ పదేళ్ల తరువాత బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో చాలామంది మండలస్థాయి నుంచి చోటామోటా నాయకులు ఆ పార్టీలో ఉండలేక అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చేస్తున్న ప్రయత్రాలు ఫలించడం లేదు. పదేళ్ల ప్రతిపక్షంలో ఉండి అనేక కష్టనష్టాలు అనుభవించిన కాంగ్రెస్ క్యాడర్ కొత్తగా పార్టీలో చేరేవారిపట్ల విముఖత చూపుతున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల వేళ సత్తుపల్లి సెగ్మెంట్‌లో అధికార కాంగ్రెస్‌లో చేరాలని పలు మండలాల నాయకులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. దీంతో సదరు నాయకులకు రెండు పార్టీల్లో వారికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కొందరు నాయకులు గత అసెంబ్లీ ఎన్నికల వరకూ బీఆర్ఎస్‌లో ఉండి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే వారిని అనుమతించబోమని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా గ్రామస్థాయిలో నాయకుల అనుమతి ఉన్న వారిని మాత్రమే పార్టీలో చేర్చుకుంటామని ప్రకటించారు. ఈ క్రమంలో కొందరి చేరికను కూడా నిలిపివేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కల్లూరులో ఒక ప్రజాప్రతినిధి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న సమాచారంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నుంచి వచ్చే సదరు నాయకుడిని చేర్చుకోవద్దంటూ తీర్మానించారు. దీంతో ఆయన చేరిక నిలిచిపోయింది. పెనుబల్లి మండలంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు కూడా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారు. కానీ వారిని కూడా పార్టీలో చేర్చుకోబోమని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ స్పష్టం చేశారు. ఇదే పరిస్థితి సత్తుపల్లి మునిసిపాలిటీలోనూ ఎదురైంది. స్థానిక కార్యకర్తల సమ్మతి లేకుండా పార్టీలో చేరాలనుకునే కౌన్సిలర్ల చేరికను వారు అడ్డుకున్నారు.

రెంటికీ చెడ్డ నాయకులు..

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరాలని ప్రయత్నించి స్థానిక నాయకుల అనుమతి లేకపోవడంతో కొందరు ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోయారు. దీంతో వారి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఆయా నాయకుల పార్టీ మార్పు వ్యవహారం బయటికి తెలుస్తుండడంతో బీఆర్ఎస్‌లోనూ వారికి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నట్లు తెలిసింది. అధికారం కోల్పోగానే కాంగ్రెస్‌లో చేరాలనుకునే వారిపై బీఆర్ఎస్ స్థానిక నాయకులు ఆగ్రహంతో ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. పార్టీ ఫిరాయింపు యత్నాలు వికటించిన వెంటనే యూటర్న్ తీసుకున్న నాయకులు తిరిగి బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇటీవల కేసీఆర్ పర్యటనలో కూడా వారు పాల్గొనటం చర్చనాయాంశంగా మారింది. పార్టీ మారాలనుకునే వారిని సమావేశాలకు పిలవద్దంటూ నాయకత్వానికి సూచిస్తున్నట్లు సమాచారం. వారిని ఎలా నమ్మి ఎన్నికల బాధ్యతలు అప్పగించగలం అని ఆయా మండలాల్లో నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా పార్టీ మారాలని ప్రయత్నాలు చేసి విఫలమైన నాయకులను సొంత పార్టీ వారుకూడా నమ్మకపోగా వారికి పార్టీ కార్యక్రమాలు కూడా అప్పగించవద్దనే డిమాండ్‌తో సదరు నాయకుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయరైందన్న చర్చ నడుస్తోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

● 16మందికి గాయాలు

పాల్వంచ, మే5: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన పాల్వంచ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. కొత్తగూడెం శ్రీనగర్ కాలనీకి చెందిన సంగెం వీరన్న (40) స్థానికంగా తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. కాగా సమీపంలోని పెద్దమ్మతల్లి దర్శనం కోసం తన భార్య సైదా, కుమారుడు వినయ్‌లతో కలసి ద్విచక్రవాహనంపై జగన్నాథపురం వచ్చాడు. పెద్దమ్మతల్లిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఇందిరాకాలనీ వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా వీరన్నను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

నేలకొండపల్లి, మే5: ఎదురెదురుగా ద్వి చక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని సుర్దేపల్లి ఎస్సీ కాలనీలో జరిగింది. భీమవరానికి చెందిన షేక్.అలీల్ ద్విచక్రవాహనంపై ఎండు మిరపకాయల వ్యాపారం చేస్తూ గ్రామాలు తిరుగుతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం సుర్దేపల్లి వెళ్తుండగా, రామచంద్రాపురానికి చెందిన అఖిల్ సుర్దేపల్లి వైపు నుంచి తన ద్విచక్రవాహనంపై రామచంద్రాపురం వెళ్తున్నాడు. ఈక్రమంలో రెండు ద్విచక్రవాహనాలు సుర్దేపల్లి ఎస్సీ కాలనీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

కారేపల్లి: ద్వి చక్ర వాహనాన్ని అంబులెన్స్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలపరిధిలోని ఉసిరికాయలపల్లి వద్ద చోటు చేసుకుంది. ఉసిరికాయలపల్లి నుంచి వంటమాస్టర్ లకావత్ రాజేష్, లకావత్ రమేష్‌లు ద్విచక్ర వాహనంపై ఇల్లెందు వెళ్తుండగా, ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ అంబులెన్స్ ఎదురుగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

కంటైనర్, ఆర్టీసీ బస్సు ఢీ..

తల్లాడ: ఆర్టీసీ బస్సు, కంటైనర్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 12మంది ప్రయాణీకులకు గాయాలైన సంఘటన తల్లాడ మండలం అంబేద్కర్‌నగర్ వద్ద ఆదివారం జాతీయ రహదారిపై జరిగింది. మణుగూర్ నుంచి ఖమ్మం వెళ్తున్న మణుగూర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు వైరా నుంచి తల్లాడ వైపు వస్తున్న కంటైనర్ ఢీకొన్నాయి. బస్సు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా డ్రైవ్ చేస్తూ కంటైనర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. సంఘటనాస్థలాన్ని తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు సందర్శించి క్షతగాత్రులను హుటాహుటిన తల్లాడ, వైరా, కల్లూర్లకు చెందిన 108వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బెల్టు దుకాణాలపై దాడులు

● రూ.57,850 విలువైన మద్యం బాటిళ్ల స్వాధీనం

భద్రాచలం, మే5: భద్రాచలంలోని పాత మార్కెట్ సమీపంలో ఉన్న ఓ బెల్టు దుకాణం పై ఆదివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.27,850 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండల పరిధిలోని భద్రాచలం-చర్ల ఆర్అండ్‌బీ ప్ర ధాన రహదారిపై అంజుబాక స మీపాన నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణం పై ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.30వేల విలువ గల 162 మద్యాన్ని పట్టుకున్నారు. దాడుల్లో అధికారి ఇమ్మడి మధు, హెడ్‌కానిస్టేబుల్ గాలి సురేష్ ఉన్నారు.



దుమ్ముగూడెంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

నీట్ పరీక్ష ప్రశాంతం



ఎస్ఐఎస్ వీవీ సెంట్రల్ పబ్లిక్ పాఠశాల వద్ద ఆలస్యంగా వచ్చి అభ్యర్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 5: దేశవ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించేందుకు నేషనల్ టెస్టింగ్ అథారిటీ(ఎన్‌టిఏ) నిర్వహించిన నేషనల్ ఎంట్రెన్స్ పరీక్ష (నీట్) ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని ఖమ్మం జిల్లా కో-ఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 3,260 మంది విద్యార్థులకు గాను 3,179 మంది పరీక్షకు హజరయ్యారని, 81 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5:20గంటల వరకు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. 1:30 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరీశీలించిన తరువాతనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్‌బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో మొత్తం 1,200 మందికి గాను 1,173 మంది, ఎస్ఐఎస్ వీవీ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో 744 మందికి 723, ఎస్‌వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో 672 మందికి 656 మంది, మ్యాక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్‌సైన్స్ కళాశాలలో 480 మందికి 468 మంది, బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్‌లో 164 మందికి 159 మంది విద్యార్థులు పరీక్షకు హజరైనట్లు తెలిపారు.

పలువురు విద్యార్థులు ఆలస్యంగా కేంద్రాలకు చేరుకోవడంతో పరీక్ష కోల్పోయారు. నీట్ నిబంధనల ప్రకారం మధ్యాహ్నం 1:30గంటల లోపే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ముందే సూచించారు. కానీ రఘునాపాలెం సమీపంలోని ఎస్ఐఎస్ వీవీ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో పలువురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చి పరీక్ష కోల్పోయారు. కల్లూరుకు చెందిన ఓ విద్యార్థిని మధ్యాహ్నం 1:35నిమిషాలకు పరీక్షా కేంద్రానికి చేరుకోగా అప్పటికే అధికారులు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేశారు. విజయవాడకు చెందిన మరో విద్యార్థి ఇదే సెంటర్‌లో పరీక్ష రాసేందుకు మధ్యాహ్నం 1:45 నిమిషాలకు చేరుకోగా అధికారులు అనుమతించలేదు. వీరితో పాటు మరో ఇద్దరు విద్యార్థులు సైతం ఆలస్యంగా వచ్చి వెనుదిరిగి వెళ్లిపోయారు. జిల్లాలోని మరికొన్నా పరీక్షా కేంద్రాల్లోనూ కొందరు విద్యార్థులు ఆలస్యంగా పరీక్ష కేంద్రాలకు చేరుకొని పరిక్షను కోల్పోయారు.

నీట్ పరీక్ష ముగించుకొని సెంటర్లనుంచి బయటికి వచ్చిన విద్యార్థులకు గాలి దుమారం స్వాగతం పలికింది. ఆదివారం సాయంత్రం ఖమ్మంనగర పరిసరాల్లో తీవ్ర గాలిదుమారం రావడంతో అప్పుడే పరీక్ష ముగించుకొని బయటికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లితండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు పరీక్షా కేంద్రాలు ప్రధాన రహదారులకు దూరంగా ఉండటంతో రవాణా సౌకర్యాలు లేకపోవటం, గాలివానకు పరీక్ష కేంద్రాల వద్ద తలదాచుకునే సౌకర్యాలు లేకపోవటంతో వర్షంలో తడుస్తూ చెట్ల కిందనే వేచిఉన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం, మే 5: మండలంలో ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈ సందర్భంగా అశ్వాపురంలోని తుళ్లూరి ఫంక్షన్ హాల్‌లో జరిగిన అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, శ్రీనివాసరావు దంపతుల మనువరాలు హన్విక అన్న ప్రాసన కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్,ఎంపిటిసిలు కమటం నరేష్, గాదెజయ,చిట్టెమ్మ,ఏనిక రవి, ఖదీర్, నెల్లిపాక సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. హన్విక అన్నప్రాసన కార్యక్రమంలో ఆదివారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు బి.అయోధ్య పాల్గొన్నారు.

అంతరించిపోతున్న అటవీ సంపద

యథేచ్ఛగా కలప రవాణా.. పట్టించుకోని అధికారులు

జూలూరుపాడు, మే 5: సహజ సంపదను కాపాడాల్సిన వారే చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుంటే ఇక సంపదను సంరక్షించే నాథుడు ఎవరు? కొందరు అక్రమార్కులు అటవీ ప్రాంతాలలోకి చొరబడి విలువైన చెట్లను నరికి కలపను అక్రమంగా తరలిస్తున్నారు. గత కొంత కాలంగా అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఎంతో విలువైన అటవీ సంపదను ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు నెలల తరపడి ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తుండటంతో నానాటికి అటవీ సంపద తరిగిపోతుండటం గమనార్హం. జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలలో విస్తరించిన విలువైన కలపను జూలూరుపాడు, ఏన్కూరు, సుజాత్‌నగర్, కారేపల్లి మండలాలకు చెందిన కొందరు అక్రమార్కులు నరికి వాహనాలలో తరలిస్తున్నారు.



వేపచెట్టు నరికి రవాణాకు సిద్ధంగా ఉంచిన దృశ్యం

వ్యాపారులదీ అదే బాట..

పట్టా భూముల్లోని వేప, చిందుగా, మామిడి, చింత తదితర రకాలకు చెందిన కలపను వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నారు. రైతుల భూముల్లోని బారీ వృక్షాలను నరికి స్థానికంగా డంపింగ్ చేసి ఆ తరువాత వాహనాలలో ఆంధ్ర ప్రాంతానికి తరలించి అమ్మకాలు సాగించి లాబాలు గడిస్తున్నారు. ఈ వ్యాపారులకు ఎలాంటి అనుమతులు లేకపోవటం గమనర్హం. పడమటనర్సాపురం, పాపకొల్లు, బేతాళపాడు, ఎలకలొడ్డు, వినోబానగర్ తదితర గ్రామాలలోని రైతుల పట్టా భూములలో చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరికి రవాణా చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న అటవీశాఖ అధికారులు..

అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా సంబంధిత అటవీశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా జూలూరుపాడుతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పట్టా భూముల్లోని కలపను నరికి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు చేస్తూ సొమ్ము చేసుకోవడాన్ని అటవీ అధికారులు నిలువరించలేకపోడం తగదని ప్రజలు అంటున్నారు. అటవీ సిబ్బంది బాధ్యతరహిత్యంగా వ్యవహరిస్తు అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



అక్రమంగా కలపను తరలిస్తున్న దృశ్యం

కలప అక్రమంగా తరలిస్తే కేసులు

ప్రసాదరావు, జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌వో

అటవీ ప్రాంతాలతో పాటు పట్టా భూముల్లో ఎవరైన వ్యక్తులు కలపను నరికి అక్రమంగా తరలిస్తుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పట్టా భూముల్లో కలపను నరకటం నిబంధనలకు విరుద్ధంమన్నారు. సిబ్బందితో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

అసమానతలు తొలగినప్పుడే అభివృద్ధి: కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని

కొత్తగూడెం టౌన్, మే 5: ఆర్థిక అసమానతలు తొలగినప్పుడే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శేషగిరి భవన్‌లో కారల్ మార్క్స్ 206వ జయంతిని నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు శేషయ్య, వంగా వెంకట్, వీరస్వామి, మల్లిఖార్జున్, వార్డు కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మునిగడప పద్మవెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం మార్క్సిజమే

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం మార్క్సిజమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో కార్ల్‌మార్క్స్ 206వ జయంతిని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరుద్యోగం, ఆకలి పేదరికం విలయతాండవం చేస్తున్నాయని అన్నారు. సమాజ మార్పుకై మార్క్సిజం ఆధారంగానే పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మార్క్స్ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎజే రమేష్, లిక్కి బాలరాజు, కొండపల్లి శ్రీధర్, భూక్య రమేష్, వీరన్న, ఎన్ రమేష్, సమ్మయ్య, రాజారావు, పద్మ, సలీమ్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

భద్రాచలం, మే 5: కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ జయంతిని భద్రాచలంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంత కాలం మార్క్స్ సిద్ధాంతం కొనసాగుతుందని, సమాజం అభివృద్ధి కావాలన్నా, సమ సమాజం నిర్మించాలన్నా, మార్క్స్ చెప్పిన దోపిడీ వర్గం నశించే వరకు ఇది సాధ్యం కాదని అన్నారు. ఈ ప్రపంచంలో ఉన్న ప్రజలందరూ సమానంగా జీవితాన్ని కొనసాగించినప్పుడే సమాజం పూర్తిస్థాయిలో అభివృద్ధి అవుతుందని చాలా మంది భ్రమిస్తున్నట్లు కమ్యూనిజానికి గడ్డు రోజులు వచ్చాయని కమ్యూనిస్టుల పని అయిపోయిందని చెబుతున్న వారందరూ ఏదో ఒక రోజు అదే కమ్యూనిజం ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి, ఎంబీ నర్సారెడ్డి, బండారు శరత్‌బాబు, వై.వెంకటరామారావు, పి.సంతోష్, లీలావతి, ఎంవిఎస్ నారాయణ, మురళీప్రసాద్, కొర్సా రవి తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలను సందర్శించిన న్యాయమూర్తి



నార చీరల వద్ద న్యాయమూర్తి కుటుంబ సభ్యులు

దుమ్ముగూడెం మే 5: పర్ణశాల రామాలయాన్ని కొత్త గూడెం జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.సాయిశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వారికి సాదరంగా ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచవటి కుటీరం, నార చీరలు, గోదావరి నదీ తీరాలను సందర్శించారు. కోర్టు సిబ్బంది రమేష్, ఆలయ ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్, అర్చ కులు శేషం కిరణ్ కుమారాచార్యులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే లక్ష్యం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలం, మే 5: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో వామపక్షాలు బలపరిచిన ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ దేశాన్ని కులాలు, మతాల పేరుతో విభజించాలని చూస్తోందని రామరాజ్యం పేరుతో రామున్ని సైతం రాజకీయాల్లోకి లాగి రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందని విమర్శించారు. పార్లమెంటులో 400 సీట్లలో గెలిపిస్తే దేశ రాజ్యాంగాన్ని మారుస్తామని పదే పదే కేంద్ర మంత్రులు చెప్పడాన్ని ప్రధానమంత్రి ఏ రకంగా సమర్థించుకుంటారని అన్నారు. రాజ్యాంగం మారిస్తే రిజర్వేషన్లకు ముప్పు వస్తుందని పౌర హక్కులు, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం దెబ్బతింటుందన్నారు. బీజేపీకి అభివృద్ధి కంటే రాజకీయాలే ముఖ్యమని బీజేపీ భావిస్తుందన్నారు. బీజేపీ మత రాజకీయాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని కోరారు. కార్పొరేటర్లకు కొమ్ముకాస్తున్న బీజేపీకి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్‌బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్. ఎన్.లీలావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

జిల్లాల రద్దు యోచన మానుకోవాలి



సమావేశంలో పాల్గొన్న రేగా

ఆళ్లపల్లి, ఏప్రిల్ 5: మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రద్దు చేసే ఆలోచనను మానుకోవాలని పినపాక మాజీ ఎమ్మెలే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయంలో నూతన జిల్లాల అభివృద్ధిని చూసి ఒర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ఆలోచన సరైంది కాదని, మీ ప్రతాపాన్ని జిల్లా అభివృద్ధిపై కాదు, బీఆర్‌ఎస్‌పై చూపించండి అన్నారు. మహబూబబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపిస్తే పినపాకను అభివృద్ధి చేసుకోవచ్చాని, ప్రతి కార్యకర్త కవిత గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, జడ్పీటీసీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ ఓబీ కార్మికుల ఆందోళన

మణుగూరుటౌన్, మే 5: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓబీ కంపెనీల కార్మికులు వేతన పెంపు, మౌలిక సదుపాయాల కల్పనపై చేస్తున్న ఆందోళన మూడవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఈ విషయమై ఆయా మూడు ఓబీ కంపెనీల బాధ్యులు కార్మికులతో చర్చలు జరుపుతున్నారు. చర్చల్లో ప్రధాన సమస్య వేతన పెంపుపై ఓ అంగీకారం కుదరలేదని తెలిసింది. కాగా సాయంత్రం మరోదఫా చర్చలు జరగనున్నట్లు తెలిసింది. యాజమాన్యంతో ఈ ఏడాది వేతనం రూ.వేయి, బోనస్ రూ.వేయికి పెంచుతూ అగ్రిమెంట్ చేసుకున్న కార్మిక సంఘాల నాయకులు కార్మికులతో పాటు యాజామాన్యాన్ని, స్థానిక ఎమ్మెల్యేను అగ్రిమెంట్ విషయంలో ఏమార్చి ఏక పక్షంగా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికై ఓబీ యాజమాన్యాలు స్పందించి కార్మికులతో ఒప్పందంచేసుకోవాలని కోరతున్నారు.

ఓబీ కంపెనీలు సానుకూలంగా స్పందించాలి: ఇఫ్టూ

ఏరియాలోని పీకేఓసీ-2, పీకేఓసీ-4, మణుగూరు ఓసీ గనుల్లో ఆఫ్‌లోడింగ్ పనులు నిర్వహిస్తున్న ఓబీ కంపెనీ యాజమాన్యాలు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని ఇఫ్టూ జిల్లా ఆర్ మదుసూదన్‌రెడ్డి అన్నారు. సమ్మె విషయంలో ఏరియా సింగరేణి యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లులు జోక్యం చేసుకోని సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఏరియా జేఏసీ విజ్ఞప్తి చేసింది.

కాంగ్రెస్‌లో పలు కుటుంబాల చేరిక

జూలూరుపాడు, మే 5: మండలంలోని జూలూరుపాడు పంచాయతీ పరిధలోని దళిత కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూలూరుపాడు పంచాయతీకి చెందిన 1వ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ మాజీ మండల ఉపాధ్యక్షుడు మోదుగు రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. జూలరుపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారందరికి కాంగ్రెస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ లేళ్ళ వెంకటరెడ్డి పార్టీ కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామాలలో ప్రచారాన్ని వేగవంతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. కాంగ్రెస్ పథకాలను విస్తృతంగా ప్రజలల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, నాయకులు నున్నా రంగరావు, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, యల్లంకి చిన్ననాగేశ్వరరావు, ఎస్‌కె.మహబూబ్‌పాషా, పణితి వెంకటేశ్వర్లు, ఎన్.పుల్లారావు, పోతురాజు నరసింహారావు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వెంకటరెడ్డి

బలరాం నాయక్ విజయానికి కృషిచేయాలి

పినపాక, మే 5: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని పినపాక కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం కోరారు. ఆదివారం ఏడూళ్లబయ్యారం క్రాస్ రోడ్లోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశానుసారం బూత్ కమిటీలకు దిశా నిర్దేశం చేసి, గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని, గతంలో రుణమాఫీ ఒకేసారి చేసి, కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతిగా నిలిచిందన్నారు. బీఆర్‌ఎస్ నాలుగు దపాలు అని చెప్పి మోసం చేసిందని, నేటికీ బ్యాంకర్లు రైతులకు నోటీసులు పంపుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, బలరాంనాయక్ గెలుపు లాంఛన ప్రాయమేనన్నారు. కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్ తిరుపతిరెడ్డి (బుల్‌రెడ్డి), కొండేరు సంపత్, మీరా సాహెబ్, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, డి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామనాథం

నమూనా పరీక్షలతో ప్రావీణ్యం పెంచుకోవాలి



పరీక్షా పత్రాన్ని ఆవిష్కరిస్తున్న నోడల్ అధికారి

భద్రాచలం, మే 5: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అవకాశం ఉన్న మేరకు నమూనా పరీక్షలో పాల్గొని ప్రావీణ్యం పెంచుకోవాలని నోడల్ అధికారి సులోచన రాణి కోరారు. ఆదివారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసెట్ మోడల్ పరీక్ష పత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సులోచన రాణి మాట్లాడుతూ ఎంసెట్ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ నమూనా పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పరీక్షల సమయాలలో విద్యార్థుల భయాన్ని వీడి ఏకాగ్రతతో పరీక్షలలో పాల్గొంటే మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్స్ కళాశాల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు, అధ్యాపకులు బషీర్ పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి: పీవో



ఈవీఎంల కూర్పును పరిశీలిస్తున్న పీవో ప్రతీక్ జైన్

మణుగూరు, మే 5: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల కమిషనింగ్ ఆదివారం పూర్తి చేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ తెలిపారు. మణుగూరు పట్టణంలోని జడ్పీ కో ఎడ్యుకేషన్ పాఠశాలలోని భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. 30 సెక్టార్ల ఏర్పాటు చేసి సెక్టర్ అధికారులు పీవోలు, ఏపీవోలు వారి సిబ్బంది సహకారంతో సెక్టర్ పీఎస్ వైజ్‌గా కమిషనింగ్ చేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామన్నారు. బీయూలు 624, సీయూలు312 వివి ప్యాట్లు 350 రిజర్వ్ మిషన్‌లు కలుపుకొని ఇంజనీర్ల సమక్షంలో జాగ్రత్త గా పరిశీలించామన్నారు. 23 మంది అభ్యర్థుల ట్టు వేసే బ్యాలెట్ పేపర్ అంటించి మిషన్లు పనితీరును పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహశీల్దార్ రాఘవరెడ్డి, ఎలక్షన్ డిటి నాగరాజు, నోడల్ అధికారి ముజాహిద్ పాల్గొన్నారు.

రెండోరోజూ హోమ్ ఓటింగ్

అశ్వారావుపేట రూరల్, మే 5: అశ్వారావుపేట నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం రెండో రోజు హోం ఓటింగ్ జరిగింది. వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 172 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు ఉండగా శనివారం 108 మంది, ఆదివారం 54 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 172మందికిగాను 162 మంది ఓటు వేశారు. ఇక పోస్టల్‌బ్యాలెట్‌కు సంబంధించి ఖమ్మం, ఇతర జిల్లాలకు సంబంధించి మొత్తం 372 మంది ఉన్నారు. మొత్తం 78 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు మండల తహసీల్దారు కృష్ణప్రసాద్ తెలిపారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్



కరకగూడెం, మే 5: మండలంలో ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడూళ్ల బయ్యారం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని అన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా రాజ్యంగం కల్పించబడిన హక్కును స్వేచ్ఛగా వినయోగించుకోవాలని కోరారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రాజేందర్, వెంకటప్పయ్య, సివిల్, స్పెషల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

బీజేపీ రాష్ట్ర నాయకుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి



కరపత్రాలను పంచుతున్న బీజేపీ నాయకులు

పాల్వంచ, మే 5: త్వరలో జరుగబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం ద్వారా కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర నాయకులు బైరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం పాల్వంచ పట్టణ పరిధిలోని 43వ బూత్ ఏరియాలోని స్వాతీ స్కూల్ ఏరియా, గాంధీబొమ్మ సెంటర్, మార్కెట్ ఏరియాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ, ప్రతి షాపుకు కరపత్రాలను పంచారు. గోడపత్రికలను అంటించారు. గత 10 సంవత్సరాల్లో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల చెరువు శ్రీను, ఎస్టీ సెల్ నాయకులు భూక్యా రవి నాయక్, రాపాక రమేష్, రంజిత్, దుర్గ, గంధం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం’

చుంచుపల్లి, మే 5: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అమాణవీయంగా ఉన్నాయని, ఆయన మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం కొత్తగూడెంలో నిర్వహించిన జన జాతర సభలో ముఖ్య అతిథిగా పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై అత్యంత అవమానకరంగా అనుచితంగా చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. కేసీఆర్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని బిఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కారణజన్ముడు కేసీఆర్‌పై ఇలాంటి అసత్య, అవాస్తవ ఆరోపణలు చేయడం అవమానించడం ఏంటని మండిపడ్డారు. ప్రత్యేక తెలంగాణ కోసం పార్టీని ఏర్పాటు చేసి అహర్నిశలు కృషి చేసి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్ అన్నారు. తెలంగాణ ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. ఈ నెల 13న జరిగే ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు ఖాయమని తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను బీఆర్‌ఎస్ పార్టీ గెలుచుకుంటుందని రేగా ఆశాభావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న రేగా కాంతారావు

రామయ్యకు అభిషేకం



భద్రాచలం, మే 5: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారికి అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అలాగే స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ నిర్వహించారు.